# సంక్రాంతి కథల పోటీలో రూ. 500/- మూడవ బహుమతి పొందిన కథ

"భార్యని అందాల షోకేస్‌లో బొమ్మలాగ చూసుకోడం మీ హీరోయిజమ్‌కి ప్రతీక. సొసైటీలో మీ గొప్పతనం మగతనం నిరూపించుకోడానికి టీవీ సెట్టూ, టేప్ రికార్డరూ, కారో, స్కూటరో మెయింటనెన్స్‌లాగే భార్యని చూసుకోడం ఓ భాగం"

"అత్తగారుకూడా మన్తో వస్తే బావుండేది"—అంది అపర్ణ.

"ఎందుకుట ?"—

ఆమె మాట్లాడకపోయేసరికి తనే అన్నాడు ఆదిత్య. "పూర్వమంటే చిన్న వయసులో పెళ్ళిళ్ళు చేసేవారు గనక... క్రొత్త కాపురంలో ఏమేం అవసరమవుతాయో. ఏమేం కొనుక్కోవాల క్రొత్త దంపతులకేం తెలీదు...కాస్త నెటిలయ్యేదాకా పెద్దవాళ్ళొచ్చి సాయంచేసి వెళ్ళేవాళ్ళు! నాల్గేళ్ళనుంచి ఉద్యోగం చేస్తున్నాను .... గృహోపకరణాలన్నీ అమర్చి గృహిణి కోసమే ఎదురుచూస్తున్నాను. నాలాటి వాళ్ళకి పెద్దవాళ్ళు 'వచ్చి' చేసే సాయంకన్నా 'రాక' చేసే సాయమే ఎక్కువ తెలుసా ?"—

అపర్ణ ఓ సారి చురుగ్గా చూసి తల వాల్చుకుంది.

ఆదిత్యకి తృప్తిగా వుంది. కించిత్ గర్వంగా కూడ వుంది. తను అనుకున్నట్లుగా భార్య వచ్చేసరికి ఏ ఒక్క వస్తువుకీ వెతుక్కోకుండా ఇంటిని తీర్చిదిద్దగల్గాడు. అపర్ణ నెమ్మదీ. అణకువా చూస్తే "మంచి గృహిణి" కాగలదన్పిస్తుంది. ఇక మెయింటెనెన్స్ విషయంలోనూ ఢోకా లేదు.

శరదృతు వెన్నెల్లాంటి చల్లని లేతనీలి రంగు కాంతి.... నిశ్శబ్దంలో లయబద్ధమైన సంగీతాన్ని సృష్టిస్తూ అతి నెమ్మదిగా తిరుగుతూన్న సీలింగ్ ఫేన్....

"ఏమిటాలోచిస్తున్నారు?" మోచేతుల కిందికి దిండు లాక్కుని దోసిట్లో గడ్డం ఆన్చి అంది అపర్ణ.

పక్కకి వత్తిగిలి మోచేతిమీద కొద్దిగా లేచి, అప్పుడే అపర్ణ జడలోంచి జారి పడిన మల్లెమొగ్గని రెండు వేళ్ళతో సున్నితంగా అందుకున్నాడు ఆదిత్య. అరవిచ్చిన మల్లెమొగ్గ.... మాటాడని మల్లెమొగ్గ.... ఎక్కణ్ణించో ఏదో అస్పష్టమైన రాగం — ఇద్దరి మధ్యా అలుముకున్న నిశ్శబ్దంలో అస్పష్టమైన భావాల గజిబిజి అల్లిక, ఆ అల్లిక క్రమబద్ధమయ్యేలోగా- అతని దృష్టి గదలో మూలగావున్న రీడింగ్ టేబుల్ మీద పడింది.

చటుక్కున లేచి వెళ్తున్న భర్తకేసి వింతగా చూసింది అపర్ణ.

టేబుల్ మీదున్న ఫైల్‌ని చేతిలోకి తీసుకుని గది బైటికి నడిచి, రెండు క్షణాల్లో తిరిగి వచ్చాడు.

"ఏమిటది?" — చెదరిన అనుభూతి వెనుక విసుగ్గా, కుతూహలంలేని ప్రశ్న. ఆ ఫైలేం చేసిందిప్పు డక్కడుంటే?

"ఏదో ఆఫీస్‌కి సంబంధించిన ఫైల్.. ఇంకలాటివేవీ ఈ గదిలోకి రావు. గదిలోకే కాదు....ఆఫీస్‌కి సంబంధించిన ఏ వ్యవహారాల్నీ ఈ యింట్లోకి రానివ్వను"....దృఢంగా అంటూ మంచంమీద వాలాడు.

"ఎందుకని?"—మాటలు నిశ్శబ్దాన్ని తరిమేశాయి. నిశ్శబ్దం అనుభూతిని మింగేసి చల్లగా జారుకుంది.

అతను చెబ్తున్నాడు- "ఆఫీస్‌కీ, ఆర్థిక సమస్యలకీ, వంటింటి ఉప్పూ పప్పూ సమస్యలకీ— ఈ బెడ్ రూం, మన 'రాత్రి స్వర్గం'కీ ఆమడ దూరం.... ఇది స్వర్గమైనా ఆఫీసవర్స్‌లో నాకు గుర్తు రాకూడదు.... అంత వుత్సాహాన్ని నాలో ఈ సాయంత్రాలూ, రాత్రిళ్ళూ, నీ చేతుల్లో వుండగానే నింపేయాలి! ఆఫీసర్ చేత చివాట్లుతిని ఆ చికాకునంతా ఇంట్లో భార్యా పిల్లల మీద చూపడం. ఇంట్లో చికాకుల్తో ఆఫీస్‌లో అవకతవక పన్లు చెయ్యడం.... 'బొగ్గుల్లేవు - రాత్రికి రగ్గుల్లేవు' అనే బాపతు సంసారాలన్నీ చూసి చూసి చిన్నప్పట్నించీ నాకు జీవితమంటే ఎలా వుండకూడదో అర్థమవుతూ వచ్చింది." ఆమె మౌనంగా వింటోంది.

"అహా!" అతని చెయ్యి అపర్ణ వెన్ను మీద సున్నితంగా కదుల్తోంది. అనుభూతి తిరిగి స్థానం పుంజుకుంటోంది.

"ఈ ఇల్లు నీకు నచ్చిందా?"

హఠాత్తుగా ఆ ప్రశ్న పెద్ద అయోమయంలో పడేసింది అపర్ణని— ఎంత పజ్లింగ్‌గా వుంది ప్రశ్న. ఎంత లైట్‌నైన ప్రశ్న.

ఇల్లంటే గోడలూ, గదులూ, తలుపులూ



## జీవిత విశేషాలు

జననం : 1955 ఫిబ్రవరిలో ప్రకాశం జిల్లాలో, పెరిగిందీ, డిగ్రీ పుచ్చుకుందీ కరీంనగర్లో. ఉపాధ్యాయినిగా ఉద్యోగం చేస్తున్నది రాజధానిలో. ఈ మధ్య నేఎం ఏ (లిట్) అయ్యాను.


నాన్నగారు గవర్నమెంట్ కాలేజిలో లెక్చరర్. అమ్మ మొదలుకొని ఇంట్లో అంతా నా కథలకి మొదటి పాఠకులూ, విమర్శకులూ, సెన్సారు వారూ (కొండొకచో).

73లో "ఆంధ్రజ్యోతి"లోనే మొదలైన నా రచనా వ్యాసంగం అడపా దడపా ఆరేడు కథలకి మించలేదు. అక్షరరూపం దాల్చిన సిరా చుక్క అరక్షణం అయినా, ఒక్క మెదడునైనా "కదిలించి" ఆలోచింప చెయ్యగలితే చాలనుకుంటాను. అలాటివే నా అభిమాన "రచనలు"

'స్వోత్కర్ష' చాలా యిబ్బందికరంసుమా: ఇంకేముందీ 'చెప్పుకోడాని'కి!

—ప్రమీల

అందులో ఎక్కడికక్కడ అవసరానికి తగట్టు అమరిన ఫర్నిచరూ! ఎవరి కళ్ళకైనా ఇది "వడ్డించిన విస్తరే"-తనకి.. అన్నిటితోపాటు అతని ఆప్యాయతా వడ్డించిన విస్తరే—అతను 'మన' అన్చెప్పే ఈ యింటి మొత్తంలో ఏ ఒక్క చిన్న వస్తువూ తను కష్టపడి సంపాయించింది కాదే? అవటానికి డబుల్ గ్రాడ్యుయేటయినా ఒక్క పైసాకూడా తను స్వయంగా సంపాయించి యెరగదు. ఈ 'పెళ్ళి' అనే రెండుక్షరాలతో తనకింత హక్కు. అధికారం. అతను సంపాదించుకున్న ప్రతి దాంట్లో పెట్టుబడి లేకుండా భాగస్వామ్యం ఎలా వచ్చాయి....? తమ ఇళ్ళలో 'రేటు' ప్రకారం యిన్ని సౌకర్యాలతో ఈ ఇంటినీ యితన్నీ కొనుక్కోడానికి ఎంత వెచ్చించాలి? ఆ అవసరం రానీకపోడం అతని ఔన్నత్యం...రానిస్తే వెచ్చించడం తండ్రి



# నేడు 'మేలా'

విధి! ఇందులో ఎక్కడా ఎప్పుడూ తన ప్రమేయం, ప్రత్యేకతా వుండవా?—

"అపూ.... ఏయ్ అపర్ణా! నచ్చలేదని చెప్పడానికంత మొహమాటం దేనికోయ్! తొందర్లో మరో పెద్దిల్లు, సెపరేట్ పోర్షన్, అదె కొంచెం ఎక్కువైతేనేం. మరో మూడేళ్ళవరకూ మనిద్దరమేగా."

ఆదిత్య చెయ్యి ఆమె చేతి గాజుల్ని సున్నితంగా పైకీ, కిందికీ కదిలిస్తూ చిత్రమైన సంగీతాన్ని సృష్టిస్తోంది.

"ప్లీజ్ మీరలా మాట్లాడద్దు. నాకీ ఇల్లు చాలా బావుంది. నాకూ.... నాకు నిద్రొస్తోంది"సడన్‌గా బోర్లా పడుకుని దిండులో ముఖం దాచేసుకున్న అపర్ణ తీరు విచిత్రంగా తోచిందతనికి.

* * *

"రండి....రండి... అక్కడే నిల్చుండిపోయారేం?" — సాదరంగా ఆహ్వానించింది సుమిత్ర. లోపలికినడిచింది అపర్ణ-

రెండ్రోజుల క్రితం "సూది వుంటే కొంచెం యివ్వరూ" అని ఉదయం తొమ్మిది గంటల వేళ హడావుడిగా పరుగెత్తుకొచ్చిన సుమిత్ర, చాలా త్వరగానే తన మాటతీరుతో, హుషారైన స్వభావంతో అపర్ణని ఆకర్షించింది.

సుమిత్ర, భర్త యిద్దరూ ఒకే స్కూల్లో టీచర్స్‌గా పనిచేస్తున్నార్ట. ఇంట్లో పెద్దవాళ్ళని ఎదిరించి వచ్చి రిజిష్టర్ మేరేజి చేసుకుని నెల్రోజులు కావొస్తోంది.

"మా వారు.... నా కోసం కుక్కర్ కొన్నారు.. చూశారా? ఈ నెలంతా ఒక్క మధూ జీవితంలో అడ్జస్ట్ చేసుకుంటే నా జీతంతో ఇది కొనగల్గాం" సుమిత్ర ముఖం క్రొత్త కుక్కర్‌కన్నా ఎక్కువ

# మల్లెపందిరి

## యుద్ధ ఫలితాలు

చక్రే చండరుచా సమం రణమసౌ హేమంత పృథ్వీపతిః
యేయే తత్ర జితా దివాకరకరా స్తైతేఽమునా తత్క్షణాత్।
కాన్తానాం కుచభూధరే నిదధిరే మన్యేఽహమేవం తదా
నోచేన్మందకరః కథం దినకర స్తప్తశ్చ తన్వీ స్తనః॥

వేయి చేతులుగల సూర్యుడితో శీతకాలమనే రాజు యుద్ధానికి దిగాడు. ఆ యుద్ధంలో చలిరాజు సూర్యుడి చేతులను (కిరణాలను) చాలావరకు నరికేసి కాంతాకుచములనే కొండలమీద పడేశాడు (అనుకుంటాను). కాకుంటే సూర్య కిరణాలు (వేడి) తగ్గిపోవడమేమిటి, స్తనం వెచ్చగా వుండడం ఏమిటి?

—సౌభరి

తళతళ్ళాడ్తోంది సంతృప్తితో — మధూ అంటే ఆమె భర్త! తన జీతంతో కొన్నామంటూనే 'మా వారు నా కోసం కొన్నార'నే తృప్తేమిటో విచిత్రంగా తోచింది అపర్ణకి.

"రేపట్నుంచి పొద్దున్నేచి నేను హడావుడి పడక్కర్లేదు. కుక్కర్లో పది నిముషాల్లో వంటంతా అయిపోతుంది కదా!"- కుక్కర్ రావడం తనకెంత ఉపయోగమో వివరించి చెబ్తోంది సుమిత్ర.

తనొచ్చేసరికే యింట్లో కుక్కర్, గ్రైండర్‌తోసహా మొత్తం వంటసామాగ్రి వుంది. తను ఉద్యోగం చెయ్యడం లేదు. కనుక పొద్దున్నేచి హడావుడిపడాల్సిన అవసరమూ లేదు. కుక్కర్ వుపయోగం ఏమిటో ప్రత్యేకించి తనకి తెలీదు. అది సేవ్ చేసే యెక్స్‌ట్రా టైమూ తనకి గోళ్ళు గిల్లుకోడానికే వుపయోగపడ్తుంది. సుమిత్ర పొందే సంతృప్తి విలువ తనకున్న సుఖ సంతోషాలకన్నా రవంత యెక్కువేమో నన్న భావం మెదిలిందపర్ణ మనసులో.

"మీకు నా సంబరం చూసే నవ్వులాటగా వుంటుందేమో. ఏమైనా అదృష్టవంతులు మీరు....మీ రొచ్చేసరికే అన్నీ రెడీమేడ్‌గా సిద్ధం చేశారు మీవారు."-సుమిత్ర అమాయకంగా మాట్లాడుకు పోతోంది.

"అవును సుమిత్రా! నా జీవితం వడ్డించిన విస్తరి. అయినా నాకు తృప్తిలేదు. విస్తట్లోకి ప్రతి ఆధరువూ స్వయంగా మీ ఆయనకి సంపాయించి వడ్డించుకుంటున్న నువ్వే గొప్పదానివి నా దృష్టిలో' అపర్ణ తన మనస్సులోంచి నాలుక చివరిదాకా వచ్చిన ఈ మాటల్ని వెనక్కి పంపేసింది.

"మీ స్కూల్లో టీచర్ పోస్టుకి వేకెన్సీ ఏదన్నా వుంటే చూస్తారేమోనని వచ్చాను. మీతోపాటు సరదాగా స్కూలు కొస్తాను నేను కూడా." చాలాసేపటి తర్వాత పెదవి విప్పి అపర్ణ అన్న మాటలకి ఆశ్చర్యంతో నోరు తెరిచింది సుమిత్ర.

"మీరా! మీకేం ఖర్మండీ."

"ఖర్మా! ఖర్మేమిటందులో?" - ఈసారి ఆశ్చర్యపోవటం అపర్ణ వంతయింది.

ఎప్పుడొచ్చాడో, కూరల సంచీ గుమ్మం వార పెట్టి చెప్పులు విడుస్తూ అందుకున్నాడు మధు— సుమిత్ర భర్త. "ఖర్మ కాకపోతే ఏమిటండీ - పెటిపోషించాల్సిందిపోయి కట్టుకున్న భార్యతో ఉద్యోగం చేయించాల్సి రావడం నాలాంటి భర్తల ఖర్మ! మీలాంటి వాళ్ళు సరదాగా చెయ్యాలంటే టీచింగ్ కాదండీ.. ఓ పది వేలు లంచం పారేసో, రికమండేషను పట్టుకునో హాయిగా ఓ 'వైట్ కాలర్డ్ జాబ్' కొనుక్కుంటే సరదాగా వుంటుంది."

అపర్ణ అవాక్కయింది అతని ధోరణికి. క్రొత్త పరిచయంలో భర్త అలా మాట్లాడ్డంతో సుమిత్ర కొంచెం గాభరాపడింది.

"ఆయనలాగే అంటార్లెండి.. అందుకే తనకి త్వరగా ఉద్యోగం రావాలని ఎందరు దేవుళ్ళకి మొక్కానో- ఇంట్లో నా పెళ్ళికి తొందరపెట్టేస్తున్నారో పక్క .... తనకి చూడబోతే ఉద్యోగం లేదు. నాకుంది గదా చాలదా, కొన్నాళ్ళు అడ్జస్టవుదామంటే తనకి పట్టుదల.... అబ్బ! ఎంత టార్చరనుభవించానో అప్పట్లో—" సుమిత్ర టాపిక్ మార్చటానికి ఏం చెబ్తోందో అర్థంకాలేదు అపర్ణకి. ఏమనుకుంటున్నాడామె భర్త తన గురించి....!

"నా ఉద్దేశ్యం.... ఉద్యోగం సరదాగా చెయ్యడం అని కాదండీ.... తనతో కల్సి పన్చెయ్యటం సరదాగా వుంటుందని.... అందరూ వైట్ కాలర్డ్ జాబ్స్ కోసమే ఎగబడాలనీ, లంచాలూ, రికమండేషన్లని సమర్థిస్తారనీ ఎక్కడుంది?"

"అహఁ.... సమర్థిస్తారని కాదు.... సమర్థత వున్నవారని! ఏ 'సమర్థతా' లేకుండా నాలుగు ముక్కలు చెప్పుకోడం మాత్రం వచ్చిన మాబోటివాళ్ళకి మిగిలిందిదొక్కటేకదండీ ఇదికూడా మీబోటి వాళ్ళు తన్నుకుపోతే."

"మీరు చాలా అన్యాయంగా మాట్లాడ్తున్నారు.... నాలుగు ముక్కలు చెప్పుకోగలగడంకూడా ఓ క్వాలిఫికేషనే - దానికీ ఓ సరిఫికెట్ కూడా వుంది! మీలాగే ఆ సర్టిఫికెట్ సంపాయించిన వాళ్ళు, మీరు చేసేదీ ఓ ఉద్యోగమే అయినప్పుడు మీతోపాటు పోటీకి రాకుండా ఎలా వుంటారు? ఉద్యోగమన్నాక ప్రతి ఉద్యోగానికీ పోటీ వుంటుంది. వుండాలి! దీనికీ లంచాలూ, రికమండేషన్లూ తెచ్చుకునే వాళ్ళున్నారు. నేనేం 'అలా' తన్నుకు పోతానంటం లేదే?"

రెండ్రోజుల పరిచయంలో ఎప్పుడూ తను మాట్లాడ్తూంటే చిరునవ్వుతో చూస్తూండటం తప్పితే నోరువిప్పి మాట్లాడి యెరగని అపర్ణలో ఆ ఆవేశం నింతల్లో వింతగా తోస్తోంది సుమిత్రకి.

"ఆంటీ అంకులొచ్చారు" అనే పక్కింటి పాప వగర్పుతోపాటు ఆగిపోయిన స్కూటర్ శబ్దం అపర్ణని లేపి నిలబెట్టి "వెళ్ళొస్తాన"న్పించాయి.

* * *

"వచ్చేసరికి ఇంట్లో లేనని కోపమా?" లాలనగా అడిగిందిఅపర్ణ. ఆదిత్య ఎందుకో ఎప్పట్లా ఉత్సాహంగా లేడు. ఏదో దీర్ఘాలోచనలో వున్నట్లు అతని కళ్ళు ఎటో చూస్తున్నాయి.

"ఛ! అదేం లేదు...." అన్నాడు తొట్రుపాటుగా.

"మరి?.... అలా వున్నారేం?"

"ఎలా? ఏంలేదే?" - ఆదిత్య చప్పున లేచి బాత్రూంలోకి వెళ్ళిపోయాడు. వచ్చి

మౌనంగానె టిఫిన్ ముగించాడు - అపర్ణ కాఫీ కలుపుతూండగా ఎవరో ఫ్రెండ్ రావటంతో అతను డ్రాయింగ్ రూంలోకి వెళ్ళాడు.

కాఫీ ట్రేతో అపర్ణ కర్టెన్ కివతల నిలబడింది అవతల్నుంచి సంభాషణ....

"అర్జంట్‌గా నాకో ఉద్యోగం చూసి పెటగలవా? జీతం కాస్త తక్కువైనా ఫర్వాలేదు" ఆదిత్య.

"మంచి జోకే! ఏం కథ? కాలేజి డేస్ గుర్తొస్తున్నాయేమిటి? ఇవాళే ఉద్యోగంలో చేరినట్లు ఉడుకు రక్తం కబుర్లు చెబుతున్నావ్"

"కబుర్లు కాదురా! ఉద్యోగంలో చేరిన్నాడిలాంటి సమస్య రాలేదు ఆ శర్మగారున్నన్నాళ్ళూ ఆఫీసులో ప్యూన్ దగ్గర్నించీ అంతా నిప్పులాంటి మనుషులే అన్పించేవాళ్ళు. ఈ కొత్తాఫీసర్తోటే గొడవొచ్చి పడింది. ఆఫీసర్తో పాటందరి గుణాలూ బైటపడ్తున్నాయ్. ఎవడెట్లా వుంటే నాకేంగానీ, నన్ను తనాడించి నట్లల్లా ఆడమంటుంటేనే వళ్ళు మండింది. సబార్డినేటంటే తన చేతిలో కీలుబొమ్మను కున్నట్లున్నాడు. చేసే వెధవపనికి ఫిఫ్టీ పర్సెంట్ షేరిస్తాట్ట షేర్!"

"నువ్వు చెయ్యకలేకపోతే ఆ ఫిఫ్టీ పర్సెంట్ షేరిచ్చే పనికూడా వుండదిత గాడికి, తెల్సునా? అంతా తన బొక్కసం లోనే నింపుకోవచ్చు. డోంట్ బి ఫూలిష్ దిత్తూ! తొందరపడకు. అసలిప్పటికే.... ఏం పడలేదుగదా?"—

"ఆహా! అందాకా వచ్చిందిలే వ్యవహారం. రెజిగ్నేషన్ లెటర్ మొహాన గొడ్డామని వెళ్తే దొరకలేదు మహాశయుడు!"—

"గుడ్‌గాడ్! మంచిపని జరిగింది! నెలకి దగ్గర దగ్గర వదిహేనొందలు కళ్ళజూసేవాడికి నేం చూపిస్తే మహా అంటే ముష్టి ఏ ఆరొందలో. బ్రహ్మచారినాడే పనికిరాలేదు నీకా ఉద్యోగాలు. ఇప్పుడిక పువ్వుల్లో పెట్టిన భార్య"

అపర్ణ కాఫీ ట్రే తెచ్చి టీపాయ్ మీదుంచి అతిథికి విష్ చేసింది. అప్పటికే కాఫీ కప్పుల్లో మీగడ పేరుకుంటోంది.

"సరి. సరి.... ముందు కాఫీ తీస్కో బెటికెళ్ళి మాట్లాడుకుందాం." ఆదిత్య కొంచెం కంగారుపడ్డాడు అపర్ణ రాకతో.

స్కూటర్ స్టార్టయి వెళ్ళిపోయిన శబ్దం విన్పించటంతో ఆశ్చర్యపోయింది- ఎంత హడావుడిలోనూ లోపలికొచ్చి 'వెళ్ళొస్తాన'ని చెప్పకుండా వెళ్ళడాదిత్య. అలా వెళ్ళిపోయిన ఆదిత్య రెండు గంటల తర్వాత హుషారుగా ఈల వేసుకుంటూ










ఎంతమాట! - ఆ నీళ్లే మళ్లీ ట్యాంకు లోకి వెళ్లి వస్తుంటాయి.

స్కూటర్ బైటే లాక్ చేసి లోపలి కొచ్చాడు వస్తూనే.... "అపూ! నీకో మాంచి ప్రెజెంటేషన్ ఏంటో చెప్పుకో చూద్దాం" అన్నాడు పాకెట్ టీపాయ్‌మీద పడేస్తూ.

అనాసక్తంగా 'ఏమిటి?' అంది సోఫాలో కూర్చుంటూ, పాకెట్ వైపు దృష్టయినా సారించకుండా.

"చూడూ తెలుస్తుంది."

తనే పాకెట్ విప్పి, జారిపోతూన్న చీర మడత సరిగ్గా ఆమె భుజాలమీద పడేలా వేశాడు. భుజంమీంచి జారుతూ నేలని పరుచుకుంటోంది మెత్తని కాశ్మీరు సిల్కు చీర- ఆమెకీ చాలా యిష్టమైన మెజంటా- బ్లాక్ కాంబినేషన్లో ప్రింట్. వంగి చేతిలోకి తీసుకునే ప్రయత్నం చెయ్యలేదపర్ణ.

"మావాడు వాళ్ళావిడకి రెండు చీరలు తీసుకున్నాడు. సెలక్షన్ నచ్చదేమోనని నేనుట్టినే శాంపిల్ పట్టుకొచ్చాను. నీకు నచ్చితే రేపెళ్ళి మరోటి కూడా. అన్నట్టు ఎల్లుండి నీ బర్త్‌డే కదూ! వైట్ అండ్ స్నఫ్ కలర్ కాంబినేషన్లో భలే బాగుంది. నీకిది యిష్టంకదా అని...." తనే వంగి చీర తీసి ఆమె భుజాల చుట్టూ కప్పి పట్టుకున్నాడు.

"ఇదెవరి బర్త్‌డేకి మరి?" అంది.

ఫెళ్ళున నవ్వాడాదిత్య అదో పెద్ద జోకయినట్లు.

"కట్టుకురా చెబ్తాను" అన్నాడు ఆమె కదల్లేదు.

"ఏమిటలా వున్నావ్....డల్‌గా? కట్టుకుని గబగబా రెడీ అవు. సెకండ్ షోకి టికెట్స్ తీసిపెట్టానన్నాడుమావాడు. వంట యిందా. వెళ్తూ హోటల్లో భోంచేసి వెళ్దామా?"—

అపర్ణ బుర్ర పన్చెయ్యటంలేదు ఆమెకి యెక్కడికీ కదలాలనిలేదు భర్తని చెయ్యి పట్టుకుని తన పక్కన కుదేసి యెన్నెన్నో అడగాలని వుంది. అతని యిప్పటి ఉత్సాహం ఎందుకనో సహజంగా లేదు.

డైనింగ్ టేబుల్ మీద అతనే భోజనానికి ఏర్పాట్లు చేస్తున్న చప్పుడు విన్పిస్తూంటే తప్పనిసరిగా లేచి వెళ్ళింది.

మెత్తని కాశ్మీర్ శిల్కు చీరలో ఒదిగిపోయిన సౌందర్యం.... నిర్లక్ష్యంగా పెట్టుకున్న కుచ్చిళ్ళు.... మరికాస్త పొందిగ్గా, అందంగా కట్టుకుంటే - ఎలా సవరించాలో తనకి తెలీదు - నవ్వుకున్నాడు. ఎందుకంత నిర్లక్ష్యం? ఎందుకంత నిరాసక్తత? తన ఉత్సాహం తావత్రయం అంతా ఎవరికోసం? ఏమాత్రం ప్రోత్సాహం, మెచ్చుకోలు కనబర్చదేం?

"అచ్చం షోకేస్‌లో బొమ్మలా వున్నావ్!" అన్నాడు పక్కగా వచ్చి నడుం చుట్టూ చెయ్యి బిగించి బైటికి దారి తీస్తూ.

"షోకేస్‌లో బొమ్మ"

షోకేస్‌లో బొమ్మట. తను షోకేస్‌లో బొమ్మా!? సాయంత్రం అతని ఫ్రెండ్ రావ్ మాట గుర్తొచ్చింది. 'పువ్వుల్లో పెట్టిన భార్య' సుమిత్ర భర్త. ఆఖరికి సుమిత్ర మాత్రం ఉద్యోగం చెయ్యటమంటే 'మీకేం ఖర్మండీ'ట! ఆవేశంగా ఏదో అనబోయి విరమించుకుని సున్నితంగా అతని చేతిని తొలగించింది.

* * *

"ఏమిటి మీలో మీరే నవ్వుకుంటున్నారు?"—వక్కపొడి అందిస్తూ అడిగింది అపర్ణ.

ఆదిత్య నవ్వు మధ్య అన్నాడు— "ఇందాక.... హాల్లో.... అంతమందిమధ్య మా వాడెలా అన్నాడో చూడు వాళ్ళావిణ్ణి! ఏమనుకుందో ఆవిడ పాపం....నువ్వయితే యేమనుకునేదానివి?"—

"నేనా?"-ఆగిపోయింది అపర్ణ.

ఇందాక హాల్లో సంగతి గుర్తొచ్చింది. ఇంటర్వెల్ తర్వాత 'ఈ చిత్రంలోని పాటలు పాలిడార్ రికార్డ్సులో వినండి' అనే స్లైడు చూస్తూనే అన్నాడు రావ్. "చెప్పాడామ్మా....మనవాడు టూ-ఇన్-వన్ కొనేస్తున్నాడు...."

రావ్ భార్య వెంటనే అందుకుని సాధించింది అలవాటుగా. "పర్లేండి చెబ్తున్నారు గొప్పగా! మీరూ వున్నారెందుకూ?"

అంతకన్నా అలవాటుగా తక్కువ అందుకుని హాలంతా విన్పించేట్లు సమాధానం చెప్పాడు రావ్ – "అవునోయ్ మా చెల్లెమ్మకి నీలాగ పక్కింటి పిన్నిగార్తో, ఎదురింటి వదినగార్తో మాటింగ్ షోలకి చెక్కేసే అలవాట్లేదుట! కాలక్షేపమెలా మరి? నువు సినిమాలు మానేస్తే మనం టేప్‌రికార్డరేం ఖర్మ వీడియోనే కొనుక్కో వచ్చు!"

బావుండదవ్పించినా ఆదిత్యకి నవ్వొచ్చిందా మాటకి. అపర్ణకి నవ్వు రాలేదప్పుడూ ఇప్పుడూ కూడా.

"అయితే నాక్కాలక్షేపానికి టేప్‌రికార్డరొక్కటే తక్కువైంది- కొనమని అడిగానా మిమ్మల్ని!" బాధ, రోషం గొంతులోనే అణచుకుంటూ అడిగింది.

ఆదిత్యకి చికాకన్పించిందామె ధోరణి- ఆమె అడిగితేనే కొనాలా తను; అడిగితే మాత్రం తప్పేమిట్ట? ఇదే రావ్ భార్యయితే అడక్కుండానే కొంటూన్నందుకు ఎంత సంబరపడిపోతుంది. ఆవిడే కాదు, ఏ భార్య అయినా, తన అక్కలూ, వదిన్లూ, అమ్మా.... ఆఖరికి చెల్లెలూ.... ఎక్కడుందీ లేడా? టేప్‌రికార్డర్ పేరు వినగానే అపర్ణ ఎగిరి గంతేస్తుందనుకున్నాడే తను! ఆమె స్వభావం తెలుస్తూనే వున్నా ఎలా అనుకున్నాడు.

"సాయంత్రం మీరొచ్చేసరికి ఎక్కడికెళ్ళానో, ఎందుకెళ్ళానో తెల్సుకోవాలని లేదా మీకు?" ఆదిత్య ముఖంలో ముభావం గమనించి అనునయంగా అడిగింది. అతను మాట్లాళ్ళేదు. మనసులో కుతూహలం తొంగిచూసినా.

"సుమిత్రా వాళ్ళ స్కూల్లో వేకెన్సీ ఏదన్నా వుందేమో కనుక్కుందామని! ఇంక నాకేం కొదవ చెప్పండి కాలక్షేపానికి!"

"స్కూల్లో జాబ్‌కోసమా!"

"అవును....తప్పేముంది? మీ ప్రిన్సి

పుల్సికి వ్యతిరేకంగా వచ్చే య్యాల్సొచ్చినచోట రాజీపడిపోయి యెందుకుండాలి మీరు? మీ ఫ్రెండ్ చూపించే ఆరొందల ఉద్యోగంతో. నాకూ ఓ నాల్గొందలువస్తే. ఇద్దరు మనుషులు వెయ్యిరూపాయల్తో బ్రతకలేరా?"

"అయితే అన్నీ వినేపించన్నమాట" అనుకున్నాడాదిత్య కోపంగా.

"అపర్ణా, ఆఫీసు విషయాలిక్కడ మాట్లాడొద్దని చెప్పాను గుర్తుందా? అది నా సమస్య. నేను పరిష్కరించుకోగలను నిన్ను సలహా అడిగానా?"

సూటిగా తగలవల్సిన చోటే తగిలిందీ మాట — అవమానంతో మాట పెగల్లేదపర్ణకి. అయినా తమాయించుకుని అంది — "అవును నా సలహా అడగలేదు మీరు! అడగరు కూడా! ఆఫ్టరాల్ ఆడది. మీకు సలహా చెప్పేపాటిది కాదు! కానీ. ఆఫీస్లో ఘర్షణపడి వచ్చినప్పటి మీ ముఖం ఎలావుందో చెప్పమన్నారా నన్ను? ఆ వేడిమీద, ఇక్కడ మీ ఫ్రెండ్ చల్లగా చేసిన బ్రెయిన్ వాష్..సాయంత్రం నుంచీ మీ ఉత్సాహమంతా ఎంత అసహజంగా ఆక్వర్డ్గా వుందో నాకు తెల్సిందీ.. అదంతా మీకు తెలీదు. మీలోవున్న ఘర్షణ కప్పిపుచ్చుకోడానికి అలా మిమ్మల్ని మీరు మభ్యపెట్టుకున్నారు...."

"చాల్లే అనాలిసిస్.... పెద్ద సైకాలజిస్టువి బైల్దేరావు!"

"భర్త మనస్తత్వం. ప్రవర్తనా అర్థం చేసుకోడానికి సైకాలజీయే తెలియాలేమిటి? మనిషి బలహీనతని టెస్ట్ చేసేది ఒకే ఒక్క క్షణం. ఆ క్షణం దాటితే, ఆ వేడి తగ్గితే అడుగడుగునా బలహీనతే డామినేట్ చేస్తుంటుంది.

ఎవరో అన్నట్టూ మడత మడతలో మత్తుమందు నింపుకున్న వ్యవస్థండీ మనది. మీ ఫ్రెండ్ అన్నట్టు 'పువ్వుల్లో పెట్టి'— భార్యని అందాల షోకేస్లో బొమ్మలాగ చూసుకోడం మీ హీరోయిజంకి ప్రతీక— సాటి సొసైటీలో మీ గొప్పతనం, మగతనం నిరూపించుకోడానికి టీవీసెట్టూ, టేప్ రికార్డరూ, కారో, స్కూటరో మెయింటెనెన్స్ లాగే భార్యని అపురూపంగా చూసుకోడం ఓ భాగం. అంతేగాని మీరపురూపంగా చూసుకోవాలనుకునే భార్య సలహామాత్రం మీకవసరంలేదు! మీభార్యకంటే మీకు మీ ఫ్రెండ్ సలహాయే బావుంటుంది. ఆ ఫ్రెండ్ భార్యలాగే మీ కంటికి ప్రతి భార్యా అది కొన్లేదూ, ఇది కొన్లేదూ అని సాధించే మామూలు ఆడది. మీలాంటి వాళ్ళకి ఆడవాళ్ళలా వుంటేనే ఇష్టం. వాళ్ళ సాధింపు వంకతో ఈ వ్యవస్థ యిచ్చే మత్తుమందుకి మీరూ లొంగిపోయి సుఖపడిపోవచ్చని."

ఆదిత్య హతాశుడై చూస్తూ హఠాత్తుగా అడిగాడు "ఇంతకీ నువ్వనేదేమిటి?"

"అదే చెబుతున్నాను. భార్యని 'షోకేస్లో బొమ్మ' లాగ కాదు చూడాల్సింది. మీతోపాటు మీలాగే మీకోసమే ఆలోచించే ప్రాణమున్న మనిషిలాగ చూడమంటున్నాను. మీరిచ్చే సుఖాల కోసమే కాచుకున్న కాబూలీవాలా లాగ కాదు మీ కష్టాన్ని పంచుకోవాలనుకునే ఓ ఫ్రెండ్లాగ చూడండి. నేనుద్యోగం చెయ్యటం మీ ప్రెస్టేజికి భంగమా?"

"అన్నేనన్నానా? ఇంత ఆవేశంవున్న దానివి, ఎదుటివాణ్ణి నోరెత్తనీకుండా వాదించగలదానివి. అంత 'మైల్డ్'గా కన్పిస్తావేమా అని! ఈ క్షణాన నేను రిజైన్ చేస్తే నన్నూ పోషించటానికి రెడీఅన్నట్టున్నావు. ఉద్యోగం కాలక్షేపం కోసం అంటావేమిటి!"

అతని మాటల్లోది వ్యంగ్యమో, మరేమిటో పట్టించుకో దల్చలేదపర్ణ.

"ఎంత ఆవేశమున్నా ఎన్ని భావాలున్నా మైల్డ్గా కన్పించటమేకాదు, మా ఆడవాళ్ళు అంత సబ్మిసివ్ గానూ వుంటారు. మీరు రెక్కగొట్టినంతకాలం 'నీ డబ్బు — నీ సంపాదన' అని గుర్తు చెయ్యకుండా వుంటే మొత్తం జీతం మీ చేతుల్లో పెట్టి మర్నాట్నుంచీ 'మా వారు నన్ను సినిమాకి తీస్కెళ్తున్నారూ, మా వారీ చీర కొనిపెట్టారూ' అని చెప్పుకోడంలోనే తృప్తిపడ్తాం కూడా!

అవును.... వేకెన్సీవుందేమో కనుక్కోడానికి సుమిత్ర దగ్గరి కెళ్ళినపుడుద్యోగం కాలక్షేపమనే అనుకున్నాను. కానిప్పుడనుకోడం లేదు.... భార్యలు గ్రాడ్యుయేట్లూ పోస్టుగ్రాడ్యుయేట్లూ కావాలని మీలాంటి వాళ్ళంతా అనుకోడం ఎందుకుట? అవసరంలో ఆదుకోపోయాక..! ఈ మోడర్న్ అప్లయన్సెసన్నీ వచ్చి ఆడవాళ్ళ కింట్లో పని తగ్గిపోయిన ఈ కాలంలో 'కాలక్షేపం' కాదు.... మా చదువులూ, శక్తీ వృథాపోడంలేదన్న కాన్ఫిడెన్స్ కావాలి మాకు, చెప్పండి. ఏ టేప్ రికార్డరో వింటూ, సినిమాలు చూస్తూ, కాదంటే ఇరుగుపొరుగమ్మలక్కల్తో పనికిరాని కబుర్లు చెబ్తూ కాలక్షేపం చెయ్యడంకంటే నేం చేస్తానంటోంది తప్పవనా?"

"ఆడవాళ్ళుద్యోగం చెయ్యడం తప్పన్నేనన్లేదే ఎప్పుడూ?"

"అన్లేదు. ఆ అవసరం రాకుండా చెయ్యడానికి అయిష్టంగానైనా అక్రమసంపాదనకి రాజీపడ్తున్నారు. రాజీనామా చేసి మీ బాస్ముందు మీ ప్రెస్టేజీ, మీ ప్రిన్సిపుల్సూ నిల్పుకోడానికి నేను సహకరించననుకున్నారవునా? ప్రతి గొప్పవాడి వెనుకా ఓ ఆడదాని అదృశ్యహస్తం వుంటుందన్నట్టు అవినీతికూడా ఆడదాని ప్రోత్సాహమే కారణమనుకోవాలంటారు!"—

"నైన్టీ పర్సెంట్! మా రావ్ భార్య చూడరాదూ? మా బాస్ భార్య కూడా అలాంటిదే అయ్యుంటుంది. "ఇంటిలోని పోరు ఇంతింత కాదయా...." అలాగే ఇంట్లో ఆడవాళ్ళకిష్టంలేని పనికూడా మేం చెయ్యలేం తెల్సునా.... ఐమీన్ చేసి బ్రతకలేం. అలా చూడకోయ్....! ఊ! అలసిపోయావుపన్యాసాల్తో. ఇక లైటార్పనా?" స్విచాఫ్ చేసి, చిన్న గొంతుకతో నెమ్మదిగా అన్నాడాదిత్య "అహ.... నా యిష్టం వచ్చినట్టు సంపాదిస్తా నీకెందుకంటే ఏం చేస్తావ్?" అంతే! అతని చేతులు విడిపించుకుని లేచి చటుక్కున స్విచ్ ఆన్ చేసిందపర్ణ. టేబుల్ లైట్ వెలుగులో సూటిగా అతని ముఖంలోకి చూసింది. అతని వెనుక గోడమీద పెద్దదిగా అతని నీడ. గోడవేపు చూపుతూ అంది "అటు చూడండి "అతను వెనక్కి చూశాడు. తన నీడ తప్ప మరేం కన్పించలేదు. ఏమిటన్నట్టు ఆమెవేపు చూశాడు తిరిగి.

"ఇదిగో ఈ లైట్. ఐమీన్ వెలుగు. మీరు దీన్ని చూస్తుంటేనే, మీవెనక ఆ నీడ తోడు. మీరు చీకట్లోకి వెళ్ళి కూచుంటే అదుండదు. అర్థమైందా?"

రెండు క్షణాల అనంతరం అతని ముఖంలో అభినందన చేతల్లో వెల్లువై ఆమెని చుట్టి ముంచేసింది.

